# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 138 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 14 ఏప్రిల్ 2026 | పేజీలు : 4





## భూ పరిపాలనకు
# కొత్త దిక్సూచి భూభారతి

- చరిత్రాత్మక చట్టానికి నేటితో ఏడాది పూర్తి
- ఏడాదిలో 5 కోట్లకు పైగా భూభారతి పోర్టల్ సందర్శన
- 70 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్
- 3.80 లక్షల మందికి పాస్‌బుక్‌ల జారీ జారీ
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, మన చౌరాస్తా :** ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలు సామాన్యుడికి సులభంగా అందేలా గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం తెలంగాణ చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తోందన్నారు. ఈనెల 14వ తేదీతో భూభారతి చట్టం అమలులోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి గారు అధికారులతో భూభారతి చట్టంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక చట్టానికి ఏడాది పూర్తైన సందర్భం మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రంలో భూహక్కుల రక్షణకు ప్రారంభమైన కొత్త శకానికి నాందిపలికిన రోజని వ్యాఖ్యానించారు. భూభారతి చట్టానికి ముందు ఆ తర్వాత ఉన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఈ చట్టం తీసుకువచ్చే నాటికి ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ ప్రజానీకం ఎదుర్కొన్న పరిస్థితులను ఈ సందర్భంగా మంత్రిగారు గుర్తు చేశారు. 'నాటి పరిస్థితిని పూర్తిగా మార్చాలన్న సంకల్పంతో పారదర్శకత, బాధ్యతాయుత, వేగం అనే మూడు ప్రధాన సూత్రాలతో రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువచేస్తున్నాం. ఈ క్రమంలోనే చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చాం. ఈ చట్టం రాష్ట్రంలోని భూపరిపాలనను పారదర్శకంగా సులభంగా మార్చింది. బిఆరఎస్ ప్రభుత్వ పాలనలో సరైన విధివిధానాలు లేకుండా తీసుకొచ్చిన 2020 ఆర్వోఆర్ చట్టం, ధరణి పోర్టల్ వల్ల లక్షలాది మంది ప్రజలు తమ భూముల హక్కుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూమి తమదే అయినప్పటికీ హక్కులను నిరూపించుకునేందుకు అధికారుల, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ఆనాటి పరిస్థితులను చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని గత ఏడాది ఏప్రిల్ 14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి చేతుల మీదుగా భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించుకున్నాం. తెలంగాణ రైతాంగానికి భూ భద్రత కల్పించడంలో భూభారతి ఒక బలమైన ఆయుధంగా మారింది. భూ వివాదాలకు చరమగీతం పాడుతూ, సామాన్యుడికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గించడంలో ఈ ఏడాది కాలం ఒక గొప్ప ముందడుగుగా నిలిచింది. ఈ 12 నెలల కాలంలో భూభారతి పోర్టల్ పాత చిక్కుముడులను విప్పడంలో కీలక పాత్ర పోషించింది. ఈ పోర్టల్ ప్రారంభించిన ఏడాదిలోపే 5.20 కోట్లకు పైగా ప్రజలు ఈ పోర్టల్‌ను సందర్శించారు. సుమారు 67 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్ అయ్యారు. ప్రజల కోసం రెవెన్యూ శాఖ లో గణనీయమైన మార్పులు తెస్తున్నాం. రైతులకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం సంస్థ ఎన్.ఐ.సి.తో కలిసి రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి ఐదు జిల్లాల్లోని ఐదు మండలాల్లో? ప్రయోగాత్మకంగా ప్రారంభించడం జరిగింది. ఇక్కడ ఎదురయ్యే మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని అవసరమైన మార్పులు చేర్పులు చేసి వచ్చే నెలలో జిల్లాకు ఒక మండలంలో ప్రారంభిస్తాం.రాష్ట్రంలో నిజాం కాలం నుంచి 378 గ్రామాలను నక్షాలు లేవు. ఇందులో ఐదు గ్రామాలలో రీ సర్వే పూర్తి చేసి భూదార్ నెంబర్ కేటాయించాం.మిగిలిన 373 గ్రామాల్లో రోవర్స్ వంటి ఆధునిక సర్వే సాంకేతికతను ఉపయోగించి రీసర్వే పనులు కొనసాగిస్తున్నాం.. అని తెలిపారు.



# క్షేమంగా ఇంటి రండి..

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- వరంగల్‌లో అరైవ్.. అలైవ్ కార్యక్రమం..

3 లో




# సేవలు వేగవంతం చేయాలి

**వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రజల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి దరఖాస్తులు సమర్పించారు. అందిన వినతిపత్రాలను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులతో దరఖాస్తుదారుల సమక్షంలోనే చర్చించి సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజావాణిలో అందిన వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మొత్తం 166 దరఖాస్తులు అందాయని, అందులో రెవెన్యూ శాఖకు 74, జీడబ్ల్యూఎంసీ,కు 25, ఇతర శాఖలకు 67 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వచ్చిన నేపథ్యంలో వాటిని సంబంధిత తహసీల్దార్లకు ఎండార్స్ చేసి వేగవంతంగా పరిష్కారం కల్పించాలని సూచించారు. ప్రజావాణిలో జూమ్ వీడియో కాల్ ద్వారా సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో నేరుగా సమన్వయం చేసి, దరఖాస్తుదారుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణ చర్యలు చేపట్టారు. అదేవిధంగా వృద్ధులకు సంబంధించిన దరఖాస్తులను శిశు సంక్షేమ వయోవృద్ధుల సంక్షేమ శాఖతో పాటు సఖి సెంటర్ కోఆర్డినేటర్ శ్రీలతకు పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఆయా శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించాలని జిల్లా అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తుదారులకు అరటిపండ్లు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) సంధ్యారాణి, (లోకల్ బాడీ), డీఆర్ఓ విజయ లక్ష్మి, వై.వి. గణేష్, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, డీఎంహెచ్ఓ డా. సాంబశివరావు, డీపీఓ కల్పన తదితర జిల్లా అధికారులు, సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాణాలు ప్రతి ఒక్కరూ పాటించాలి

- **హెల్మెట్ లేకుంటే ఊరిలోకి ప్రవేశం లేదు**
- **కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్**

**వరంగల్, మన చౌరాస్తా :** రోడ్డు భద్రత ప్రమాణాలు పాటింటి ప్రయాణం చేయాలనీ లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఖిల్లా వరంగల్ స్థానిక కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్, ఎస్ ఐ మహేష్ హెచ్చరించారు. ఈ సందర్భంగా సోమవారం రోజు హెల్మెట్ లేకుంటే గ్రామం లోకి ప్రవేశం లేదంటూ హెచ్చరిక బ్యానర్స్ ఏర్పాటు చేస్తూ రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని అవగాహనా ఏర్పాటు చేస్తూ ఖిలా వరంగల్ ద్వారా గ్రౌండ్ దగ్గర, హనుమాన్ సెంటర్ మరియు కోట కింద బ్యానర్లు కట్టించి అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా ఇంటికి చేరాలని కోరారు. ముఖ్యంగా హెల్మెట్ తప్పకుండా వదలని లేని పక్షం లొ కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రోడ్డు భద్రత కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమం లొ కమిటీ సభ్యులతో పాటు స్థానికులు ప్రతాప్, రాజమల్లు, బోలెషా, అభిషేక్, హఃశ్రాఫ్,ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.






## మొక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం

పరకాల, మన చౌరాస్తా : సంగెం మండల కేంద్రంలో మొక్కల కొనుగోలు కేంద్రం, డీసీసీ బ్యాంకు శాఖను పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా. సత్య శారద సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు. మొక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం రైతులకు ఎంతో మేలు చేస్తుందని, ఈ కేంద్రం ద్వారా రైతులు తమ పంటలను నేరుగా విక్రయించి సరైన ధరలు పొందే అవకాశం కలుగుతుందని, మధ్యవర్తుల సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, రైతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలని సూచించారు. డీసీసీ బ్యాంకులో ఎస్‌బీఐ తరహాలో ఆన్‌లైన్ సేవలు అందిస్తే లావాదేవీలు పారదర్శకంగా ఉండటంతో పాటు రికార్డులు భద్రంగా ఉంటాయని, ప్రజలకు మరింత సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. డీసీసీ



బ్యాంకు సీఈఓ శ్రీ వజీర్ సుల్తాన్ మాట్లాడుతూ, సంగెం మండలంలో 33వ శాఖను ప్రారంభించడం ఆనందంగా ఉందని, రైతులకు మెరుగైన సేవలు అందించడంలో బ్యాంకు ముందంజలో ఉంటుందని అన్నారు. జిల్లా సహకార అధికారి (డీసీఓ) శ్రీమతి నీరజ మాట్లాడుతూ, రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో డీసీసీ బ్యాంకు కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ సొసైటీ చైర్మన్ కుమారస్వామి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, సంగెం సర్పంచ్ లలిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మోహన్ భాగవత్ ఆలోచన సాధ్యమేనా..!

**'కులాలకు అతీతంగా హిందూ సమాజం ఏకం కావాలి.. సామాజిక సమరతతోనే దేశాన్ని బలోపేతం చేయగలం..'** ఇవి ఇటీవల రాష్ట్రీ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ అన్న మాటలు.. అయితే.. కులాలకు అతీతంగా హిందూ సమాజం ఇప్పట్లో ఏకం కాదేమో? హిందువులుగా అందరం ఒకటిగా ఉంటామేమో! కానీ అన్ని కులాలం ఇప్పట్లో ఏకంకామేమో.. అంతెందుకు ఈ దేశ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపడం కోసం రాజ్యాంగాన్ని రాసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి జన్మదినమైన ఏప్రిల్ 14న మీ RSS కార్యాలయంలో దళిత సామాజిక వర్గానికి చెందిన నా కుటుంబానికి ఒక పూట భోజనం పెట్టగలరా..! ( పెడతారేమో మిమ్మల్ని బదనాం చేయడమనే ఉద్దేశం నాది కాదు.. ) ఒక పూట అన్నం పెట్టి మా కుటుంబంలో సంతోషాన్ని నింపండి. మా హిందూ సమాజ బిడ్డలు వీళ్లు అని చెప్పుకోగలరా? హిందువులమైన మనమందరం హిందువులమైన మేము క్రింది స్థాయిలో ఉన్న కులాలము అనే భావనతో ఉన్న వారిని ఆ భావన నుండి తొలగించుటలో మనం విఫలమవుతున్నామేమో. హిందువులను సంఘటితం చేసే ఆలోచనలో ఉన్న మనలాంటి వాళ్ళ ఓటు బ్యాంకుతో ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతున్నవారు..(తెలంగాణ రాష్ట్ర రాజకీయాల ఉద్దేశించి మాత్రమే ఇది) మన హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకుందాం.. మీ పిలుపును వ్యక్తిగతంగా నేను స్వాగతిస్తున్నాను. ఏకమవడానికి నేను అందులో భాగస్వామిని అవుతాను.. కానీ నన్ను అక్కున చేర్చుకునేది ఎవరు?.. ఇటీవల ( కులానికి సంబంధించి) సుప్రీం కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ మీద తెలంగాణ రాష్ట్రంలో ఉన్న హిందూ సంఘాల స్టాండ్ ఏమిటి.. ప్రధానంగా మన హిందూ ఓట్లనే ఆధారంగా చేసుకుని నడుపుతున్న రాజకీయ పార్టీ స్టాండ్ ఏమిటో మీడియా సమావేశం ద్వారా స్పష్టతనివ్వగలరా?... గౌరవ సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ను హిందూ సమాజానికి విడమర్చి చెప్పడంలో, వారికి అండగా నిలబడడంలో మీరు ఆశించిన స్థాయిలో ఉన్నారా అన్నదానిపై ఆత్మ విమర్శ చేసుకుందామా... నేను పై వ్యాఖ్యలు రాసినందుకు నేను పని చేస్తున్న సంఘం నన్ను ఆ సంఘము నుండి తొలగించవచ్చు కాక కానీ నేను నమ్ముకున్న దైవాలకు అనుగుణంగానే నా మనసులోని మాటలను వ్యక్తపరుస్తాను.. నా తాత, నా తల్లిదండ్రులు హిందువులుగానే ఉన్నారు.. ఇగో బిడ్డ ఇవి మన ఇలవేల్పు దేవుళ్ళు అని నాకు చెప్పినారు.. ఎస్.. నేను ఆ దేవుళ్లను పూజిస్తాను.. ఆ దైవాల తర్వాత మనుషుల్లో నాకు దేవుళ్ళు అంటే మా అమ్మానాన్న, నా భార్య పిల్లలు, నా మేలుకోరే నా స్నేహితులు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్.. నేను హిందువుగా ఏకమవుతాను కానీ ఇతర మతాలను ద్వేషించను, దూషించను... నా హిందూ మతాన్ని అవమాన పరిస్తే దుఃఖ పడుతాను ..

**గెస్ట్ కాలమ్**



- తాటి కుమార్,
మాల మహాసభ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్,
రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇంచార్జ్

# ప్రజావాణి ఆర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

**జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**







**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్జీదారుల సమస్యల గురించి తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా 258 ఆర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణిలో ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన వివిధ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ఈ సందర్భంగా వచ్చిన దరఖాస్తుల పై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటిని త్వరిత గతిన పరిష్కరించాలని సూచించారు.

**పక్షవాతం బాధితునికి వెంటనే సాయం..**

లింగాలఘనపురం మండలం, జీడికల్ గ్రామానికి చెందిన మాధవి, తన భర్తకు హార్ట్ స్ట్రోక్ తో పక్షవాతం రాగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుని మెరుగైన వైద్యం అందించి.... తమను ఆదుకోవాలని వినతి పత్రం సమర్పించింది. అక్కడికక్కడే కలెక్టర్ వెంటనే స్పందించి, ఆయన త్వరగా కోలుకునేందుకు మందులు ఇప్పించారు. ఈ క్రమంలో వచ్చిన మరికొన్ని దరఖాస్తులు ఇలా ఉన్నాయి.

బచ్చన్నపేట మండలం, పోచన్నపేట గ్రామానికి చెందిన నర్సింగ శైలజ, తమ ఇల్లు పూర్తిగా కూలిపోయింది అని, ప్రస్తుతం అద్దెకు ఉంటున్నారని, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోగా, సర్వే జరిగిన సమయంలో హైదరాబాదులో పనికి వెళ్లారని, ఊరిలో అందుబాటులో లేకపోవడం వల్ల ఇల్లు రాలేదని, ఈ విషయమై విచారణ జరిపించి, ఇల్లు మంజూరు చేయించగలరని దరఖాస్తు చేసుకున్నారు.

బచ్చన్నపేట మండలం, నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సలేంద్రి సత్తయ్య, వయసు 73 ఏళ్లు, తనకు గత రెండు సంవత్సరాల క్రితం ఆసరా గుర్తింపు కార్డు ఇవ్వడం జరిగిందని, కానీ ఎటువంటి పింఛను రావడం లేదు అని, కావున వృద్ధాప్య పింఛను ఇప్పించగలరని కోరుతూ దరఖాస్తు చేసియున్నారు.

తరిగొప్పుల మండలం, బొత్తలపర్రె గ్రామానికి చెందిన భూక్య లక్ష్మీ, తనకు బొంతగట్టు నాగారం గ్రామ రెవెన్యూ పరిధిలో 20 గుంటల భూమి కలదని, ఆ భూమిని పట్టా పాస్ బుక్ లోకి ఎక్కించగలరని ఆర్జీ ద్వారా కోరారు.

జనగామ మండలం, పెంబర్తి గ్రామానికి చెందిన చిన్నం మలయ్య, వయసు 65 ఏళ్లని, ఇప్పటి వరకు ఎలాంటి వృద్ధాప్య పింఛను రావడం లేదని, ఈ మేరకు వృద్ధాప్య పింఛను వచ్చే విధంగా మనవి చేస్తూ, వినతిపత్రం సమర్పించనైనది.

దేవరుప్పుల మండలం, స్థానిక నివాసి అయిన ఆకల యాదగిరి, తనకు ఎటువంటి స్థిరాస్తులు లేవని, చాలా నిరుపేద కుటుంబం అని, తనకు 2022లో ఆక్సిడెంట్ అయ్యి రెండు కాళ్లు పనిచేయడం లేదని, ఈ విషయమై రేషన్ బియ్యం ఇప్పించుట కొరకు వినతి ఇవ్వనైనది.

ఈ ప్రజావాణిలో ఆర్డీఓ గోపీరాం, వెంకన్న, డీడబ్ల్యూఓ కోదండరాములు, డీఏఓ అంబికా సోనీ, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్షేమంగా ఇంటి రండి..

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**వరంగల్ సిటీ, మన చౌరాస్తా :** వాహనాలపై ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ క్షేమంగా ఇంటి రావాలని..మీ రాక కోసం మీ కుటుంబ సభ్యులు ఎదురు చూస్తారని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో రోడ్డు భద్రతతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకుగా నేటి నుండి ఈ నెల 18 తేది వరకు చేపట్టిన అర్రైవ్ అలైవ్ కార్యక్రమములో భాగంగా ఎల్కతుర్తి మండలం చింతల్ పల్లి గ్రామంలో ఎల్కతుర్తి పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధి పాల్గోన్నారు. ఈ సందర్భంగా చింతల్ పల్లి గ్రామంలో ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించే విధంగా వాహనదారులకు అవగాహన కల్పించి రీతిలో ఎర్పాటు చేసిన బైక్ ర్యాలీ వరంగల్ పోలీస్ కమిషనర్, సెంటర్ జోన్ డిసిపి ధార కవిత, స్థానిక పోలీస్ అధికారులు గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారులతో బైక్ ర్యాలీలో పాల్గొని గ్రామస్తులను ఉత్తేజపరిచారు. అనంతరం గ్రామ పంచాయితీ కార్యాలయము ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు పోలీస్ కమిషనర్ పాల్గోని గ్రామస్తులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా నడపాల్సి వుంటుందని ముందుగా వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపటంతో పాటు, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ ప్రయాణించడం ప్రమాదకరమని, ద్విచక్ర వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, హెల్మెట్ ధరించి వాహనం నడపటం ద్వారా ప్రమాదాలకు గురైనప్పుడు ప్రమాద భారిన పడకుండా హెల్మెట్ తో రక్షించబడుతారని, అలాగే యువత అతివేగంగా వాహనాలను నడిపి మృత్యువాత పడవద్దని రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఈ రోడ్డు ప్రమాదాలు ఎంతో మంది తల్లిదండ్రులకు కన్నీళ్ళకు కారణమవుతున్నాయని ప్రతి వాహనదారుడు జాగ్రత్తగా వాహనంగా నడపటంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగివుండటంతో పాటు వాటిని అచరించాలని సిపి తెలియజేసారు. అనంతరం చింతల్ పల్లి గ్రామంలోని వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి రావాలని లేదంటే గ్రామంలో ప్రవేశం లేదని గ్రామ సభలో తీర్మానం చేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా గ్రామస్తులకు హెల్మెట్లను పంపిణీలు చేసారు. ఈ కార్యక్రమములో కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సిఐ పులి రమేష్, కాజీపేట్, హసన్‌పర్తి ఇన్స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, చేరాలు, ఎల్కతుర్తి, ముల్కనూర్ ఎస్.ఐలు ప్రవీణ్ కుమార్, రాజు, గ్రామ సర్పంచ్ రజితా రవీందర్, మార్కెట్ చైర్మన్ సంతాజీతో ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా సాగాలి

**రోడ్డు భద్రతపై అప్రమత్తత అవసరం**
**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



లింగాలఘణపురం, మన చౌరాస్తా : ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యమని...రోడ్డు భద్రతపై ప్రజలు అప్రమత్తత అవసరమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తోన్న అరైవ్ అలైవ్ లో భాగం గా రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని నెల్లుట్ల గ్రామ పంచాయతీ పరిధిలో గల పంచాయతీ కార్యాలయంలో సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. శిరస్త్రాణం (హెల్మెట్), సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో ఖచ్చితంగా శిరస్త్రాణం ధరించాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపకూడదు అని సూచించారు. అలాగే ఐఎస్ఐ ధృవీకరించిన హెల్మెట్ (శిరస్త్రాణం)లను మాత్రమే ఉపయోగించాలని, తద్వారా ప్రమాదాల సమయంలో తలకు పటిష్ట రక్షణ కల్పించి, ప్రాణ నష్టం తగ్గించవచ్చని వివరించారు. పాదచారులు కూడా జాగ్రత్తగా రోడ్లు దాటాలని, నిర్దేశిత జీబ్రా క్రాసింగ్‌లను వినియోగించాలని చెప్పారు. ప్రజల సహకారంతోనే ప్రమాదాలను తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని స్పష్టం చేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. నేటి నుంచి ఈ నెల 18వ తేదీ వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమ వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలోని (280) గ్రామ పంచాయతీల్లో రోడ్డు భద్రత గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి, సమావేశాలను చేపడుతున్నామని, అదే విధంగా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం, ట్రాఫిక్ నిబంధనల పట్ల బాధ్యతాయుత ప్రవర్తనను అలవరచడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రాణ నష్టాన్ని నివారించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. తదనంతరం రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు వారు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ నూరుద్దీన్, ఇతర సంబంధిత అధికారులు, పోలీసు అధికారులు, గ్రామ సర్పంచ్, పంచాయతీ, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మకంచ పాఠశాలకు

# వాటర్ ఫిల్టర్ బహూకరణ

**జనగామ, మన చౌరాస్తా :** జెడ్పీఎస్ఎస్ ధర్మకంచ పాఠశాలలో స్ట్రీట్ కాస్ ఎన్జీవో హైదరాబాద్ వారిచే ఒక లక్ష రూపాయల విలువగల వాటర్ ఫిల్టర్ ను అందజేసినట్టు సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ మెంబర్ వవిజయ్ తెలిపారు. డివిజనల్ ప్రెసిడెంట్ సాత్విక్, వాలంటీర్స్ మేఘన వ్యోమ్, సర్దార్ పరమేందర్ సింగ్ ఆధ్వర్యంలో ఈ ఫిల్టర్ ను అందజేశారు. ఈ సందర్భంగా పీఎంశ్రీ జడ్.పి.హెచ్.ఎస్ ధర్మ కంచ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.కనకయ్య వారికి కృతజ్ఞతలు పారు.



# ఘనంగా బహుజన కవి సమ్మేళనం

జనగామ, మన చౌరాస్తా : తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జనగామ పట్టణంలోని ఏబివి జూనియర్ కళాశాలలో 'బహుజన కవి సమ్మేళనం' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంబేడ్కర్ సేవా పురస్కార గ్రహీత, దళిత రత్న, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నారపు శివశంకర్ సభాధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులు గా రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి, దళిత రత్న డాక్టర్ పి.సుగుణాకర్ రాజు, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ హాజరై మాట్లాడుతూ.. సమాజ మార్పులో కవులు, కళాకారుల పాత్ర కీలకమని కొనియాడారు. బహుజన తత్వాన్ని, అంబేడ్కర్ ఆశయాలను అక్షర రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ప్రజా వాగ్గేయకారుడు సాంబరాజు యాదగిరి,కవులు కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు జి.కృష్ణ, తమ ప్రసంగాలతో, పాటలతో సభికులను రంజింపజేశారు. కవి హృదయం సాహిత్య వేదిక అధ్యక్షుడు పెట్లోజు సోమేశ్వరాచారి, అభినందన కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు అయిలా సోమనర్సింహాచారి,డాక్టర్ వేముల సదానందం సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కవులు రేణుకుంట్ల మురళీ, మాన్యపు భుజేందర్, అంకాల సోమయ్య, చింత ప్రసాద్, గుండె కనకయ్య, గడ్డం మనోజ్ కుమార్ గౌడ్, నిమ్మ జయపాల్ రెడ్డి, నిమ్మ రాంరెడ్డి, మ్యాజిక్ ఆనంద్,పొట్టబత్తిని భాస్కర్, జోగు సుదర్శన్,కన్నారపు పరశురాములు, మసురం రాజేంద్రప్రసాద్, మామిండ్ల అంజయ్య, గజవెల్లి శివాజీ తమ కవితా గానంతో సామాజిక అంశాలను ఎలుగెత్తారు. అనంతరం కవులకు కుల నిర్మూలన, గులాం గిరి పుస్తకాలను కానుకగా అందిస్తూ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్వోకేట్ రాగల్ల శ్రీహరి, కన్నారపు శంకర్, బలుగుల నరేష్, ఇట్టబోయిన సాయి తదితరులు పాల్గొన్నారు.






## ఇంటర్ ఫలితాలలో 'అపోలో' విద్యార్థుల ప్రభంజనం

- **టాపర్లను సత్కరించిన ఏసీపీ సౌదారపు సదానందం**

**హుస్నాబాద్, మన చౌరాస్తా** : ఇంటర్ పరీక్ష ఫలితాలలో హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ అపోలో వొకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ మీడియట్ వొకేషనల్ విభాగంలో మొదటి సంవత్సరం మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపిహెచ్ డబ్ల్యూ) గ్రూప్ ఆరే మాధవి 500 మార్కులకు గాను 465, ఎలక్ట్రికల్ టెక్నీషియన్(ఈటి) లో భూక్య వసంత 439, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్ టి)లో ఎం. శ్రీ చరణ్య 390, ఆగ్రికల్చర్ క్రాప్ ప్రొడక్షన్ (ఎసిపి)లో కే. రాజేష్ 365, ద్వితీయ సంవత్సరంలో ఎంపిహెచ్ డబ్యూ లో 1000 మార్కులకు గాను కే. సుజాత రాణి 969, ఈటీలో లింగాల ప్రవీణ్ 958, ఎల్ఎండిటి లో జి. మహేందర్ 918, ఎసిపిలో బి. శ్రీకర్ 909, ఎంఎల్ టి లో సిహెచ్. శివ 836 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన కళాశాల విద్యార్థులను హుస్నాబాద్ ఏసిపి సౌదారపు సదానందం పుష్ప గుచ్చాలు అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ విద్యార్థులు ఇదే ఫలితాలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత చదువుల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోదించాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వేముల గణేష్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదిగి కన్న తల్లితండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు, చదువుకున్న విద్యాలయాలకు మంచి పేరును తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సమత వేముల లతో పాటు అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



**రఘునాథపల్లి, మన చౌరాస్తా** : రఘునాథపల్లి మండలానికి నూతన తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించినా రాజేష్ రెడ్డి ఈ రోజు వారి కార్యాలయం లో రఘునాథపల్లి మండల మాజీ ఎంపీపీ వై కుమార్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ముసిపట్ల విజయ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ శుభాకాంక్షలు తెలిపారు,ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గూడ కిరణ్ కుమార్,కొర్ర రాజేందర్ నాయక్,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నూనెముంతల యాకస్వామి, నియోజకవర్గ మహిళా ఇంచార్జీ మడ్లపల్లి సునీత , మండల యూత్ అధ్యక్షులు దుబ్బాక హరీష్ గౌడ్, మండల నాయకులు బండి కుమార్ , మడ్లపల్లి రాజు,ముప్పిడి సాంబ, మార్కుల మహేందర్, నూనావత్ కుమార్ పాల్గొన్నారు






Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**